ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
3★
గురువారం 11 జూలై 2024



పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవు 6లో..

ధైర్యంతో ముందుకు సాగితేనే కష్టాలను జయిస్తాం 6లో..

ప్రాజెక్టులపైనే ఆశలు



- అంతంత మాత్రంగానే పడుతున్న వర్షాలు
- వెలవెలబోతున్న ఎస్సారెస్పీ, శ్రీపాద ఎల్లంపల్లి
- భారీ వర్షాలు పడకుంటే సాగు, తాగునీటికి తిప్పలే..
- ఆందోళన చెందుతున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఎస్సారెస్పీ, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులపైనే జిల్లాకు చెందిన రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటివరకు జిల్లాలో వర్షాలు అంతంత మాత్రంగానే పడినప్పటికీ, ప్రాజెక్టులు నిండితే పంటలకు సాగు నీటికి ఢోకా ఉండదని భావిస్తున్నారు. ఎస్సారెస్పీ ఎగువ భాగాన మహారాష్ట్రలో కురిస్తేనే, ఎస్సారెస్పీ నిండి జిల్లాకు ప్రయోజనం చేకూరనున్నదని రైతులు అంటున్నారు. జిల్లాలో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 237.1మిల్లీమీటర్లు కాగా, 265.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇది సాధారణ వర్షపాతమే. ఇప్పటి వరకు భారీ వర్షాలు పడకపోవడంతో చెరువులు, కుంటల్లోకి, ప్రాజెక్టుల్లోకి నీళ్లు రాలేదు. అడపాదడపా కురుస్తున్న వర్షాల వల్ల పంటల సాగు ముందుకు సాగేలా లేదు. జిల్లాలోని 14 మండలాల్లో అత్యధికంగా పాలకుర్తి మండలంలో సాధారణ వర్షపాతం 236.5 మిల్లీ మీటర్లకు 165.0 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయ్యింది. ఈ మండలంలో అత్యంత దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి.

● వరప్రదాయిని 'శ్రీరాంసాగర్'

జిల్లా రైతులకు వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని డి-83, డి-86 కాలువల ద్వారా లక్షా 82 వేల 699 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. 1090 చెరువులు, కుంటల కింద 51,323 ఎకరాలు, బోరు బావులు, వ్యవసాయ బావుల కింద 1,00,831 ఎకరాలు, వర్షాధారం కింద 21,747 ఎకరాల్లో పంటలు సాగు కానున్నాయి. అయితే సరిపడా వర్షాకాలం ఆరంభమై 40 రోజులు గడుస్తున్నా కూడా ఆశించిన మేరకు వర్షాలు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో వర్షాలు పడకపోయినా ఎస్సారెస్పీ ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో పడినా చాలు అని రైతులు అంటున్నారు. ఎస్సారెస్పీ నీటి సామర్థ్యం 90 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 12.324 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి 16.964 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులోకి 50 నుంచి 60 టీఎంసీల వరకు నీళ్లు వస్తే గానీ ఆయకట్టు భూములకు సాగునీటిని విడుదల చేయరు. ప్రస్తుతానికి మహారాష్ట్ర ఎగువ భాగంలో కూడా వర్షాలు పడడం లేదు. అలాగే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 4.76 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. ఈ ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కూడా వర్షాలు పడడం లేదు. నిర్మల్ జిల్లాలో గల కడెం ప్రాజెక్టు కూడా నీళ్లు లేక వెలవెలబోతున్నది. కడెం, ఎస్సారెస్పీ ప్రాజెక్టులు నిండిన తర్వాత అదనంగా వచ్చే నీటిని గోదావరిలోకి వదిలితే ఆ నీళ్లు ఎల్లంపల్లికి వచ్చి చేరుతాయి. ఎల్లంపల్లి నిండితే జిల్లాలోని గుండారం రిజర్వాయర్ కింద 40 వేల ఎకరాల భూములు సాగు కానున్నాయి. జిల్లాతో పాటు హైదరాబాద్‌కు తాగు నీరు అందనున్నది. కానీ ప్రాజెక్టు నిండడం లేదు.

● వర్షాల కోసం ఎదురుచూపు..

గత ఏడాది ఇదే సమయానికి భారీ వర్షాలు కురవకుంటే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి పంప్‌హౌస్‌ల ద్వారా 10 టీఎంసీల వరకు నీటిని ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఎత్తిపోశారు. ఇంతలో భారీ వర్షాలు ప్రారంభం కావడంతో మోటార్లను ఆపేశారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు కూడా ఆగస్టులో పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుని మిగులు జలాలను గోదావరిలోకి వదిలిపెట్టారు. ఎస్సారెస్పీ నిండడం వల్ల జిల్లాలోని ఆయకట్టు భూములకు రెండు పంటలకు సరిపడా సాగు నీళ్లు అందాయి. ఇప్పటివరకు వ్యవసాయ బావుల కింద రైతులు వరి నాట్లను ప్రారంభించారు. దాదాపు 28 వేల ఎకరాల్లో వరి నాట్లు పడగా, 56వేల ఎకరాల్లో పత్తి సాగు చేపట్టారని జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి తెలిపారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో పత్తి, మొక్కజొన్న వంటి పంటలకు ఊరట కలుగుతున్నదని చెప్పారు. చెరువులు, కుంటల్లో నీళ్లు లేకపోవడం వల్ల వాటి కింద ఇంకా పంటలు సాగు కావడం లేదని, రైతులు వరి నార్లు పోసుకుని వర్షాల కోసం ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాలో గానీ, ఎస్సారెస్పీ ఎగువ ప్రాంతంలో కానీ భారీ వర్షాలు పడకుంటే సాగు, తాగునీటి కష్టాలను రైతులు, ప్రజలు ఎదుర్కోవాల్సి వస్తుంది.



రామగుండంలో ఎన్టీపీసీ ఆర్ఈడీ పర్యటన



మొక్కను నాటుతున్న ఆర్ఈడీ ప్రేంప్రకాష్

జ్యోతినగర్, జులై 10 : ఎన్టీపీసీ ఆర్ఈడీ(దక్షిణ, పశ్చిమ1) ప్రేం ప్రకాష్ బుధవారం రామగుండం ప్రాజెక్టులో పర్యటించారు. ఉదయం ఎన్టీపీసీ పీటీఎస్‌లో నిర్వహించిన వన మహోత్సవాన్ని ఆర్ఈడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాస్ ట్రీ ప్లాంటేషన్‌లో భాగంగా ఆర్ఈడీ ప్రేం ప్రకాష్, రామగుండం ఈడీ కేదార్ రంజన్ పాండు, ఎన్టీపీసీ ఉద్యోగులు, అధికారులు, ఎస్ఆర్ఎస్ఎం పోటీలలో పాల్గొంటున్న ప్లేయర్లు మొక్కలు నాటారు. అలాగే ఎన్టీపీసీ ధన్వంతరి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆయుష్ వాటికను ఆర్ఈడీ ప్రారంభించారు. అనంతరం ఎన్టీపీసీ దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమంలో ఆర్ఈడీ ప్రేం ప్రకాష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి దోమ ఆదిరెడ్డి

కమాన్‌పూర్, జూలై 10 : రాబోయే వర్షాకాలంలో సీజన్‌లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి దోమ ఆదిరెడ్డి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య శాఖ వారితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా మురుగు నీరు నిల్వ ఉండకుండా సత్వర చర్యలు తీసుకునేలా కిందిస్థాయి సిబ్బందితో పనులు చేయించాలన్నారు. బావులు, ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్, మురుగు కాలువలను శుభ్రం చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆరిఫొద్దీన్, ఇన్‌చార్జీ ఎంపీడీవో శేషయ్య, ఏపీవో లావణ్య, కార్యదర్శులు నరేష్, మారుతి, జాల రేణుక, ప్రశాంత్, రాజ్యలక్ష్మీ తదితరులు ఉన్నారు.

మొక్కల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలి : ఎమ్మెల్యే విజయరమణారావు



గర్రెపల్లిలో మొక్క నాటిన ఎమ్మెల్యే విజయరమణారావు



మంథనిలో మొక్కలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రమ

సుల్తానాబాద్, జూలై 10: మొక్కలు నాటడంతోనే సరికాదని, వాటిని సంరక్షించుకునే బాధ్యత కూడా మనదేనన్న సంగతిని మరవకూడదని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి మోడల్ స్కూల్ ఆవరణలో బుధవారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో 27 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రభుత్వ అధికారులు, గ్రామాల్లోని నాయకులు ప్రజలు మొక్కలను నాటి వాటిని సంరక్షించుకునే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు, డీఎఫ్‌వో శివయ్య, ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, ప్రిన్సిపాల్ రఘునాథ్, పులి అనూష, నాయకులు మినుపాల ప్రకాష్‌రావు, అంతటి అన్నయ్య, దామోదర్ రావు, కల్లేపల్లి జానీ, పులి వెంకటేశం, బిరుదు క్రిష్ణ, చక్రధర్, కవ్వంపల్లి తిరుపతి, మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు చిలుక సతీష్, డీకొండ శ్రీనివాస్, పొన్నం చంద్రయ్య, కల్వల శ్రీనివాస్, గుజ్జేటి వెంకన్న, న్నయ్య నూగిళ్ల మల్లయ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవ లక్ష్యాలను పూర్తి చేయాలి

రామగిరి, జూలై 10: వనమహోత్సవ లక్ష్యాలను సత్వారం పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. బుధవారం సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధీలోని సెంటినరీకాలనీలోని నర్సరీని సందర్శించి మొక్కలను నాటారు. అనంతరం నర్సరీలో వివిధ రకాల ఔషధ లక్షణలను కలిగిన మొక్కలను పరిశీలించి అభినందించారు. సింగరేణి ఆర్జీ-3 డివిజన్‌కు నిర్ధేశించిన 1,75,000 మొక్కలను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎం సుధాకర్‌రావు, డిప్యూటీ సీఎం ఫారెస్ట్రీ బానోతు కర్ణ, అధికారి రమణ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మంథని, జూలై 10 : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి సూచించారు. స్థానిక బోయినిపేటలో వన మహోత్సవంలో భాగంగా బుధవారం ఆమె ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని కాలుష్యం నివారణ కోసం నాటే మొక్కలను సంరక్షించడం సామాజిక బాధ్యతగా అందరు గుర్తు పెట్టుకోవాలన్నారు. ప్రజలకు అన్ని రకాల పూల, ఫల మొక్కలను పంపిణీ చేస్తున్నామని, వీటి నాటి రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

జూలపల్లి, జూలై 10 : మండలంలోని పెద్దాపూర్ ప్రభుత్వ ఆదర్శపాఠశాల ఆవరణలో బుధవారం వన మహోత్సవంలో భాగంగా ఎంపీడీవో పద్మజ అధ్యాపకులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి శ్రీలత, లక్ష్మణ్, సదానందం పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

జాతీయ రహదారుల నిర్మాణానికి గడువులోగా భూసేకరణ పూర్తిచేయాలి

- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం - కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీహర్ష, అధికారులు

పెద్దపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణానికి గడువులోగా భూసేకరణ పూర్తిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం సీఎం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి జాతీయ రహదారుల భూసేకరణ పురోగతిపై కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీజినల్ రింగ్ రోడ్డు ఎక్స్‌ప్రెస్‌వే ఉత్తర భాగం, మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ ఎన్‌హెచ్ 163జీ, ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల ఎన్‌హెచ్ 63 నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ పురోగతిపై సంబంధిత కలెక్టర్‌లు, ఇతర ఉన్నతాధికారులతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చించి పలు సూచనలు చేశారు. మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ ఎన్‌హెచ్ 163జీ జాతీయ రహదారి మన రాష్ట్రంలో దాదాపు 334 కిలోమీటర్ల మేర ఉంటుందని, దీనికి సంబంధించి 1383 హెక్టార్ల భూసేకరణ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 1284 హెక్టార్ల భూమికి అవార్డు పాస్ చేశామని, 415 హెక్టార్ల భూమి జాతీయ రహదారుల అథారిటీకి అప్పగించామన్నారు. ఎన్‌హెచ్ 163జీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 99 హెక్టార్ల భూసేకరణ ప్రక్రియ నెలరోజుల వ్యవధిలో పూర్తి చేయాలని అన్నారు. భూసేకరణ అవార్డు పాస్ చేసి భూ బదలాయింపు జరగని సంబంధిత రైతులు, భూ యాజమాన్యంతో చర్చించి ఆర్బిట్రేషన్‌కు వచ్చేలా చూడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి అన్నారు. ఆర్బిట్రేషన్ ప్రక్రియలో జాతీయ రహదారుల అధికారులను భాగస్వామ్యం చేయాలని, గత 6 నెలల కాలంలో సంబంధిత భూసేకరణ ప్రాంతాల్లో జరిగిన అత్యధిక విలువ లావాదేవీల డాక్యుమెంట్‌లు ఆర్బిట్రేషన్ ద్వారా జారీ చేసే అవార్డులతో జత చేయాలని, జూలై నెలాఖరు నాటికి ఆర్బిట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. భూసేకరణ ప్రక్రియలో కలెక్టర్‌లు నేరుగా రైతులతో చర్చించాలని, వారికి జాతీయ రహదారుల అథారిటీ ద్వారా మెరుగైన పరిహారం అందించేందుకు కృషి చేస్తున్నామని భరోసా కల్పించాలన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో కోల్పోతున్న అటవీ శాఖ భూములకు ప్రత్యామ్నాయ భూములు గుర్తించి అఫారెస్టేషన్ ప్రారంభించాలని, అటవీ శాఖ ద్వారా అవసరమైన అనుమతులు త్వరగా సాధించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మంచిర్యాల 8 వరంగల్ గ్రీన్ ఫీల్డ్ నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పెద్దపల్లి జిల్లాలో 37 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం జరుగనుందని, దీనికి సంబంధించి 204.4 హెక్టార్ల భూ సేకరణ చేయాల్సి ఉండగా 196.3 హెక్టార్ల భూసేకరణ అవార్డు పాస్ చేశామని, పరిహారంతో రైతులు సంతృప్తి చెందక భూములు అప్పగించడం లేదని, రైతులతో పలుమార్లు చర్చలు జరిపి ఆర్బిట్రేషన్‌కు వచ్చేందుకు ఒప్పించామన్నారు. జాతీయ రహదారుల అధికారులను భాగస్వామ్యం చేస్తూ, సరైన ఆధారాలతో ఆర్బిట్రేషన్ అవార్డు పాస్ చేస్తామని, జూలై నెలాఖరు నాటికి ఆర్బిట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి సవరించిన అవార్డులు జారీ చేస్తామని, ఆర్బిట్రేషన్ ప్రకారం పరిహారం విడుదల చేసిన 10 రోజులలో భూమి జాతీయ రహదారుల ఆథారిటి అపcగిస్తామని కలెక్టర్ తెలిపారు. పెండింగ్ ఉన్న 8.1 హెక్టార్ల భూసేకరణ నెల రోజుల వ్యవధిలో పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి వీ హనుమా నాయక్, జిల్లా అటవీ శాఖ అధికారి శివయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడిన గీట్ల జనార్దన్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మంథని, జూలై 10: కాంగ్రెస్ పార్టీతో మొదలైన బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన చరిత్ర స్వర్గీయ గీట్ల జనార్దన్‌రెడ్డికే ఉందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. స్థానిక ఏఎంసీ యార్డులో మాజీ ఎమ్మెల్సీ గీట్ల జనార్దన్‌రెడ్డి జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పుట్ట మధు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంథనిలో గీట్ల జనార్దన్‌రెడ్డి విగ్రహం పెట్టడానికి ప్రత్యేకత ఉందని మంథని నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని తాను భావిస్తున్నట్లు తెలిపారు. మంథనిలో మహనీయుల విగ్రహాలు పెట్టడానికి ఒక ఆశయం, ఆకాంక్ష ఉన్నదన్నారు. గీట్ల జనార్దన్‌రెడ్డి ఈ ప్రాంతం నుంచి మొదటి ఎమ్మెల్సీ, మంథనిలో మార్కెట్ కమిటీ తీసుకువచ్చిన వ్యక్తిగా రైతులకు గుర్తు ఉండాలని ఆయన విగ్రహం పెట్టడం జరిగిందన్నారు. ఆనాడు ఇద్దరు ఎంఎల్ఏలు ఉండేవాళ్ళని గంగాపూరి వాస్తవ్యులు జీ రాములు హుజురాబాద్ ఎంఎల్ఏ ఉన్నారని తెలిసేందుకు వారి విగ్రహం పెట్టామన్నారు. గులుకోట శ్రీరాములు మంథని మొదటి ఎంఎల్ఏ, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా సోషలిస్టు పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యే అని గుర్తుచేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ వచ్చినప్పుడు నుంచి బానిసత్వం మొదలు అయిందన్నారు. ఆ బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన చరిత్ర గీట్ల జనార్దన్‌రెడ్డిదన్నారు. మంథనిలో కాంగ్రెస్ పార్టీ అయినప్పటికీ బాబు జగ్జీవన్‌రావు, పీవీ నరసింహారావు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చిన వ్యక్తిగా పీవీ విగ్రహాలు పెట్టడానికి కారణాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న పుట్ట మధు

జంబోజు రాజయ్యకు నివాళి..

స్థానిక ఆర్‌సీ కట్టలోని శ్రీహనుమాన్ దేవాలయ సమీపంలో జరిగిన టీడీపీ సీనియర్ నేత జంబోజు రాజయ్య సంతాపసభలో శాసనసభా మాజీ స్పీకర్ మధుసుధనాచారి, ఎమ్మెల్యే పుట్ట మధులు నివాళులర్పించారు. బడుగు,బలహీన వర్గాల ప్రజల కోసం నైతిక రాజకీయాలు చేశారని ఆయన సేవలను కొనియాడారు. రాజయ్య మృతిపై సంతాపం వ్యక్తం చేసి, అనంతరం ఆయన కుటుంబాన్ని వారు పరామర్శించారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 10: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు చదువు దూరమైపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి నిరసన తెలిపారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని కార్మిక క్షేత్రమైన రాజీవ్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 326 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వారందరికి విద్యను బోధించేందుకు ఐదుగురు ఉపాధ్యాయుల మాత్రమే పని చేస్తున్నారని ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటినుంచి ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు నియమించకపోవడంతో సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చదువుకు దూరమైపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మా పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించి మా పిల్లలకు చదువులను నేర్పించాలంటూ పిల్లల తల్లిదండ్రులు బుధవారం కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట బైటాయించి ధర్నా చేశారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ అక్కడి చేరుకుని ధర్నా చేస్తున్న తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతున్నాయని బదిలీలు ముగిసిన వెంటనే మీ పాఠశాలకు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు ధర్నాను విరమించారు.


సిరిసిల్ల కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకొని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

వేములవాడ టౌన్, జూలై 10: వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన బొమ్మళ లక్ష్మి అనే మహిళ వద్ద ఉన్న ప్లాట్‌ను అక్రమంగా తన పేరుమీద రిజిస్ట్రేషన్ చేసుకుని డబ్బులు ఇవ్వకుండా కులం పేరుతో దూషించిన వ్యక్తిని అరెస్టు చేసి రౌడీ షీట్ ఓపెన్ చేసి రిమాండ్‌కు పంపినట్లు జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వివరాల ప్రకారం అనుపురం గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ తిప్పాపూర్ గ్రామంలో ప్లాట్‌ను విక్రయించి తన కూతురు వివాహం చేయాలని చూసింది. దీంతో సదరు ప్లాట్‌ను వేములవాడ పట్టణానికి చెందిన వోద్యాల వేణు అనే వ్యక్తి తనకు విక్రయిస్తే రూ.6 లక్షలు ఇస్తానని నమ్మబలికి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. లక్ష్మికి ఇస్తానన్న డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తే 2022లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే ఆ ప్లాట్‌ను ఎల్లారెడ్డిపేట మండలంకు చెందిన ఓ వ్యక్తికి అమ్మినట్లు తెలువగా పెద్ద మనుషులతో మాట్లాడి రూ. 8.50 లక్షలు ఇస్తానని ఒప్పుకుని ఒక లక్ష మాత్రమే ఇచ్చి మిగతా డబ్బులు ఇవ్వకుండా కులం పేరుతో తిడుతూ చంపుతానని బెదిరించడంతో లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయగా జిల్లా ఎస్పీ విచారణ చేసి నేరం రుజువు కావడంతో వేణును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అంతే కాకుండా అతనిపై గతంలో వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో, కరీనంగర్ వన్ టౌన్, టూ టౌన్‌లలో పలు చీటింగ్ కేసులు నమోదు నమోదయ్యాయని, బెదిరింపుల కేసులు, భూ సమస్యల్లో తలదూర్చి సెటిల్‌మెంట్ చేయడం వంటి కేసులతో పాటు అటెంప్ట్ మర్డర్ కేసులు ఉన్నాయని, ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండడానికి రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు పేర్కొన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, జూలై 10: కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామానికి చెందిన బుర్ర లక్ష్మయ్య(60) ఈనెల 9న సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా బుధవారం ఉదయం మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. లక్ష్మయ్యను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. ఇరు కుల్లలో 2002లో సాదాబైనామా కాగితం ఒప్పందంతో ఇరుకుల్లకు చెందిన బుర్ర ఓదయ్య వద్ద 4 గుంటల భూమిని 8 లక్షల రూపాయలు ఇచ్చి కొనుగోలు చేయగా ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు విక్రయదారు మళ్లీ రెండు లక్షలు డిమాండ్ చేయటంతో పాటు దూషించాడని మనస్థాపం చెంది తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కూతురు స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నలుగురిపై వీధి కుక్కల దాడి

సుభాష్‌నగర్, జూలై 10: కరీంనగర్ గంజ్ సమీపంలోని ఓ స్కూల్ దగ్గర వీధి కుక్కలు ముగ్గురు చిన్నారులు, వృద్ధురాలిపై దాడి చేశాయి. అక్కడే ఉన్న స్థానికులు గమనించి కుక్కలను వెళ్లకొట్టారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ ధర్నా

హుజూరాబాద్, జూలై 10: కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని కోరుతూ బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో పార్లమెంట్‌లో ఆమోదించుకున్న నాలుగు లేబర్ కోడ్‌లను, బొగ్గు బ్లాక్‌ల వేలంను రద్దు చేయడంతో పాటు ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలన్నారు. నాయకులు అజ్జు, సరోజన, రాజ్‌కుమార్, నర్సయ్య, సులోచన, రాజేశ్వరి, లత, పుష్పలత పాల్గొన్నారు.

నేషనల్ హైవే వాహనాల ద్వారా జరిగే ప్రమాదాలే ఎక్కువ

శంకరపట్నం, జూలై 10: హుజూరాబాద్ సబ్ డివిజన్ పరిధిలో ఫోర్‌లైన్ జాతీయ రహదారికి మట్టి తరలిస్తున్న వాహనాల ద్వారానే ప్రమాదాలు ఎక్కువ జరిగాయని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. బుధవారం కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో రోడ్డు భద్రతా నియమాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. డ్రైవర్లు ఓవర్ లోడ్, అధిక స్పీడ్‌తో వెళ్లడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల తీరును చూసి జడ్జి దిగ్భ్రాంతికి లోనయ్యారని సందర్భాన్ని గుర్తు చేశారు. ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు అవగాహన సమావేశాలు నిర్వహించాలని జడ్జి సూచించారన్నారు.

ఓపీఎస్ అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

● సీఎంకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల అర్బన్, జూలై 10: ప్రభుత్వ ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంత జీవితంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవకుండా ఉద్యోగ సేవలకు ప్రతిఫలంగా, సామాజిక భద్రత కల్పించేందుకు పెన్షన్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, తదనుగుణంగా సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ విధానం అమలుకు ప్రభుత్వం చేపట్టాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో ఓల్డ్ పెన్షన్ స్థానంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం తెరపైకి తెచ్చారని, తెలంగాణ ప్రాంత ఉద్యోగులు ఓపీఎస్ అమలుకు దశాబ్దాలుగా పోరాటం చేసినా గత ప్రభుత్వం ఎలాంటి పరిష్కారానికి చొరవ చూపలేదన్నారు. సీపీఎస్ విధానంలో ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేసినప్పుడు పెన్షన్ పొందే అవకాశం లేకపోవడంతో అవసాన దశలో సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ప్రతి పౌరునికి పెన్షన్ ఇవ్వాలనే ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్న విధంగా ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను పరిగణలోకి తీసుకొని వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో సైతం పేర్కొన్నట్లుగా కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం స్థానంలో ఓల్డ్ పెన్షన్ స్కీం విధానం అమలు చేసేందుకు పూర్తిస్థాయిలో అధ్యయనం చేపట్టాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులకు సామాజిక భద్రత అందించడంతో పాటు ఆత్మగౌరవంతో జీవించ గలిగే పరిస్థితులు నెలకొల్పేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని వారి సమస్యలు పరిష్కరిస్తుందన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

● నిరుపయోగంగా వ్యవసాయ శాఖ, స్త్రీశక్తి భవనాలు ● వినియోగంలోకి తీసుకురావాలంటున్న ప్రజలు



మరమ్మతులకు నోచుకోని వ్యవసాయ శాఖ భవనం



నిరుపయోగంగా ఉన్న స్త్రీశక్తి భవనం

కథలాపూర్, జూలై 10: లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు పనికి రాకుండా పోతున్నాయి. అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టకపోవడంతో మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తారు. అయితే ప్రజలకు అనువుగా ఉండడమే కాకుండా సిబ్బందికి అనుకూలంగా ఉండే విధంగా నిర్మించాల్సి ఉండగా దాన్ని విస్మరించారనే చర్చ జరుగుతోంది.

మహిళా స్వశక్తి భవనం ఉపాధి హామీ పథకం కింద వెచ్చించిన సుమారు రూ.26 లక్షలతో ఆరేళ్ల క్రితం నిర్మించారు. అధికారులు, సిబ్బంది కోసం మూడు గదులు, సమావేశాల నిమిత్తం ప్రత్యేకంగా గది నిర్మించారు. అయితే ఆ సమయంలో ఇరుకుగా ఉన్న దర్వాజలు పెట్టడం వల్ల బెంచీలు, కుర్చీలు, టేబుళ్లు కార్యాలయంలోకి తీసుకువెళ్లడానికి వీలు లేని పరిస్థితి ఉంది. దీంతో ప్రస్తుతం ఉన్న కార్యాలయాలన్ని నూతన భవనంలోకి మార్చడానికి వీలు లేని దుస్థితి ఏర్పడింది. దీనికి తోడు ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతినడం వల్ల కనీసం సమావేశాలు ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కొత్త భవనం నిర్మించినా ఫలితం లేకుండా మారింది. అదేవిధంగా వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది కోసం నిర్మించిన భవనం తలుపులు ఊడిపోయి, ఫ్లోరింగ్ చెడిపోవడం వల్ల కొంత కాలంగా భవనం తెరుచుకోవడమే లేదు. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారి కార్యాలయం లేక ఇటు సిబ్బంది, అటు రైతులు అవస్థలు పడుతున్నారు. భవనానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేస్తేనే అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది.

మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం

నరహరి, సెర్ప్ ఏపీఎం



స్త్రీశక్తి భవనం పూర్తి చేసినప్పటికీ తమకు అందుబాటులోకి రావడం లేదు. దర్వాజాలు ఇరుకుగా నిర్మించినందువల్ల కనీసం కుర్చీలు కూడా భవనంలోకి తీసుకెళ్లలేని పరిస్థితి. ఫ్లోరింగ్ పూర్తిగా ధ్వంసమైంది. మహిళలతో సమావేశాలు కూడా నిర్వహించడానికి వీలు లేదు. కొత్త భవనమే అయినా తాము వినియోగించుకోలేక పోతున్నాం. మరమ్మతులు చేయించాలని ఏపీడీతో చర్చించాం.ఇంజినీర్‌తో అంచనాలు వేయించి ఉన్నతాధికారులకు నివేదించనున్నాం.

ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు మరమ్మతులు నిలిపివేత

● ఆర్అండ్‌బీ అధికారుల నివేదిక కోరిన కలెక్టర్

హుజూరాబాద్, జూలై 10: హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వాస్తు పేరిట అనాధికారికంగా మరమ్మతులు చేస్తుండగా బుధవారం పనులను ఆర్అండ్‌బీ అధికారులు నిలుపుదల చేసినట్లు తెలిసింది. ఈ ఎమ్మెల్యే క్యాంపు వ్యవహారంపై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సమగ్ర నివేదిక ఇవ్వాలని రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనం వాస్తు ప్రకారం లేదనే కారణంతో పోర్టికో, కిటికీలు, తలుపులను, గోడలను తొలగిస్తున్న విషయం సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీంతో పాటు స్థానిక కాంగ్రెస్, బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే పనులను నిలుపుదల చేసి నివేదిక అందించాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ పనులు నిలిపివేయడంపై హుజూరాబాద్‌లో చర్చనీయాంశంగా మారింది.

● ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరుగుతున్న మరమ్మతు పనులను నిలిపివేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు నేరెళ్ల మహేందర్‌గౌడ్, బీజేపీ నాయకుడు బింగి కరుణాకర్‌లు బుధవారం ఆర్డీవో, ఏసీపీలకు ఫిర్యాదు చేశారు.

యువతి ఆత్మహత్య

వెల్గటూర్, జూలై 10: మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన రంగం పూజిత (19) అనే యువతి మంగళవారం ఉరి వేసుకొని మృతి చెందగా బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు పూజిత సంవత్సర కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటిలో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్డుకు చున్నీతో ఉరి వేసుకొని మంగళవారం మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అటవీ గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

వీర్నపల్లి, జూలై 10: అటవీ గ్రామాల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నివసించేందుకు పోలీస్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. వీర్నపల్లి మండలంలోని జవహర్‌లాల్ నాయక్ తండా, సీతారాం నాయక్ తండా, బండ తండాతోపాటు ఆయా తండాల ప్రధాన రహదారి వెంట ఎల్లారెడ్డిపేట సర్కిల్ పోలీసులు బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యలు ఎదురైతే పోలీసులను సంప్రదించాలన్నారు. గంభీరావుపేట ఏఎస్సై ప్రభాకర్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేట హెడ్‌కానిస్టేబుల్ పాషా పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

జగిత్యాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టులోకి 1,852 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.323 సామర్థ్యంకు ప్రస్తుతం 12.324 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.964 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూన్ 1 నుంచి ప్రాజెక్టులోకి 6.418 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



హన్మంతు (ఫైల్)

మానకొండూర్, జూలై 10 : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ గ్రామానికి చెందిన మోదుంపల్లి హన్మంతు (56) అనే వ్యక్తి బుధవారం తన ఇంటి సమీపంలోని కరీంనగర్- జమ్మికుంట ప్రధాన రహదారిపై నుంచి బహిర్భూమికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో హన్మంతుకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య లస్మమ్మ, కుమారుడు గోపి ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 10: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,600 పలికింది. పదిహేను రోజుల క్రితం పత్తి ధర రూ.7,300 పలికింది. క్రమేపీ పెరుగుతూ వస్తూ ప్రస్తుతం రూ.7600 చేరుకుంది. బుధవారం మార్కెట్ యార్డుకు 17మంది రైతులు 293క్వింటాళ్ల విడి పత్తిని విక్రయానికి తీసుకు వచ్చారు. బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7600, కనిష్ఠ ధర రూ.7400 చెల్లించి ప్రైవేట్ వ్యాపారులు పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

చెరువు ఆక్రమణపై అధికారుల విచారణ

మల్యాల, జూలై 10: మల్యాలలోని పలు చెరువులు ఆక్రమణకు గురి అవుతుండడంతో అధికారులు బుధవారం పరిశీలించి పలు ఫిర్యాదులపై విచారణ జరిపారు. మల్యాలలోని చెరువులు ఆక్రమణకు గురి అవుతున్నాయని కాపాడి తమ జీవనోపాధి కోల్పోకుండా చర్యలు తీసుకోవాలంటూ స్థానిక గంగపుత్ర సంఘం సభ్యులు నెల రోజుల క్రితం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చెరువులో మట్టి నింపుతుండడంతో విస్తీర్ణం తగ్గడమే కాకుండా చేపల పెంపకానికి ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్, రెవెన్యూ, మత్స్య శాఖ అధికారులు మల్యాలలోని సూరప్ప, మత్తడి చెరువులను పరిశీలించారు. చెరువుల వద్ద మట్టి నింపుతున్నట్లు అధికారుల విచారణలో తేలడంతో చర్యల కోసం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. విచారణ జరిపిన వారిలో డీఈ తిరుపతి, ఆర్ఐ తిరుపతి, గంగపుత్ర సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

రైలు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

ఓదెల, జూలై 10 : మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని రైలు ఢీకొని శ్రీరామోజు స్వస్తిక్ అనే యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. మండలంలోని కనగర్తికి చెందిన స్వస్తిక్ మధ్యాహ్నం ఓదెలకు వచ్చినట్లు సమాచారం. సాయంత్రం వేళల్లో రైల్వే స్టేషన్ వైపు వెళ్లిన వ్యక్తి గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో ముఖం నుజ్జునుజ్జు అయ్యింది. కొన ఊపిరితో ఉన్న స్వస్తిక్‌ను 108 అంబులెన్స్ ద్వారా కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉంది.

హాస్టల్స్, హోటల్స్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ

ధర్మపురి, జూలై 10: ధర్మపురి పట్టణంలోని మైనార్టీ జూనియర్ కళాశాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ స్కూల్‌లో నాసిరకంగా ఉన్న చెడిపోయిన కూరగాయలను బయట పడవేయించారు. అలాగే ఫాస్ట్ ఫుడ్ సెంటర్, హోటల్స్ బేకరీలను కూడ తనిఖీ జరిమానాలు విధించారు. స్థానిక లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అన్నదానం, ప్రసాద విక్రయశాలను పరిశీలించి ప్రసాదాలను టెస్టింగ్ కోసం ఆమె వెంట తీసుకెళ్లారు. ప్రతీ ఒక్కరు నాణ్యత ప్రమాణాలు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆమె సూచించారు.

మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఎస్ఆర్‌టీ అధికారి

కొడిమ్యాల, జూలై 10 : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలను బుధవారం స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రేనింగ్(ఎస్ఆర్‌టీ) అధికారి భరణి ఆకస్మికంగా సందర్శించారు. మోడల్ స్కూల్‌లో పరిశుభ్రత, బోధన విధానం, మధ్యాహ్న భోజనం, క్రీడా మైదానం, వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన పలు అంశాలను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదిలో విద్యార్థులకు ఉపాధ్యాయులు చేస్తున్న బోధన తీరును ప్రత్యక్షంగా పరిశీలించి అభినందించారు. ఈ సందర్శనలో ప్రిన్సిపాల్ బి లావణ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

ముగిసిన ఎన్టీపీసీ దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్

● బ్యాడ్మింటన్‌లో విజేత రామగుండం జట్టు



బ్యాడ్మింటన్ విజేత రామగుండం ఎన్టీపీసీ జట్టు

జ్యోతినగర్, జులై 10: రామగుండం ఎన్టీపీసీలో జరిగిన ఎన్టీపీసీ దక్షిణ రీజియన్ స్పోర్ట్స్ మీట్(ఎస్ఆర్ఎస్ఎం) 2024లో బ్యాడ్మింటన్ విభాగంలో రామగుండం ఎన్టీపీసీ మహిళలు, క్రికెట్‌లో సింహాద్రి ఎన్టీపీసీ పురుషుల జట్లు చాంపియన్లుగా నిలిచాయి. నాలుగు రోజులుగా జరుగుతున్న ఎస్ఆర్ఎస్ఎం బుధవారం ముగిసింది. ఎన్టీపీసీ పీటీఎస్‌లోని స్పందన ఇండోర్ స్టేడియంలో జరిగిన మహిళల బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీలో రామగుండం జట్టు సింహాద్రి(విశాఖపట్నం) జట్టుపై విజయం సాధించింది. అలాగే మహాత్మాగాంధీ స్టేడియంలో రామగుండం, సింహాద్రి జట్ల మధ్య ఫైనల్ పోరులో సింహాద్రి ఎన్టీపీసీ గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన రామగుండం ఎన్టీపీసీ జట్టు 90 పరుగులకే ఆలౌట్ అయింది. 91 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన సింహాద్రి ఎన్టీపీసీ జట్టు 16 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అనంతరం జరిగిన స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ఎన్టీపీసీ ఆర్ఈడీ(సౌత్) ప్రేం ప్రకాష్ ముఖ్య అతిధిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. అలాగే ప్రతిభ కనబర్చిన ప్లేయర్లకు బహుమతులను అందజేశారు. నాలుగు రోజులపాటు జరిగిన పోటీలలో రామగుండం, సింహాద్రి, కుడిగి(కర్నాటక), వల్లూర్(తమిళనాడు), ఎస్ఆర్‌హెచ్‌క్యూ) హైదరాబాద్ ఎన్టీపీసీ జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆర్ఈడీ ప్రేం ప్రకాష్ ప్రసంగిస్తూ ఎన్టీపీసీ ఉద్యోగులు క్రీడలపట్ల ఆసక్తి కనబర్చాలని, నిత్యం వ్యాయామం, నడక కొనసాగించాలన్నారు. ప్రధానంగా క్రీడలతో శారీరక, మానసిక ధృడత్వం కలుగుతుందన్నారు. రానున్న కాలంలో ఎస్ఆర్ఎస్ఎం పోటీలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం, తెలంగాణ ప్రాజెక్టు ఈడీ కేదార్ రంజన్ పాండు, ఎన్‌బీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా, ఎస్ఆర్‌హెచ్‌క్యూ సీజీఎం(హెచ్ఆర్) పాణిగ్రహి, ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్ తివారి, భానేశ్వర్, హెచ్ఆర్ ఏజీఎం సిక్దర్, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సెప్టింక్ ట్యాంకులో పడ్డ బాలుడి మృతి

పెద్దపల్లిటౌన్, జూలై 10: పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం సెప్టింక్ ట్యాంకులో పడి అస్వస్థతకు గురైన బాలుడు కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన మహబూబ్‌నగర్‌కు చెందిన రాములమ్మ శ్రీనివాసుల కొడుకు జాన్‌వెస్లీ (7) మంగళవారం సెప్టిక్ ట్యాంక్‌లో పడి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం విదితమే. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆస్పత్రి నిర్లక్ష్యం వల్ల బాలుడు మృతి చెందాడని మా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాలుడి కుటుంబీకులు కోరారు.

గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట, జూలై 10: ధర్మారం గ్రామానికి చెందిన అతికెం శ్రీనివాస్‌గౌడ్ అనే గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడగా తీవ్రగాయాలయ్యాయి. బుధవారం ఉదయం కల్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా మోకు జారి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్రగాయాలు తోటి గౌడ కులస్థులు హుటాహుటిన చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు.

గ్రూప్-1 మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూలై 10: గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఔత్సాహికులు తమ దరఖాస్తులను వెబ్‌సైట్ www.tgbc-studycircle.cgg.gov.inలో ఈ నెల19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ ఈ నెల22న మొదలవుతుందన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉండాలన్నారు. ఎంపికైన వారికి శిక్షణ కాలంలో నెలకు రూ.5000 ఉపకార వేతనం అందజేస్తామన్నారు. ఉచిత శిక్షణ హైదరాబాద్ సైదాబాద్‌లోని టీజీ బీసీ స్టడీ సర్కిల్, ఖమ్మంలోని టీజీ బీసీ స్టడీ సర్కిల్‌లలో అందజేస్తారన్నారు. మరింత సమాచారం కోసం 040-24071178 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి గాయాలు

శంకరపట్నం, జూలై 10: శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామంలో కారు ఢీకొన్న ఘటనలో బుధవారం మతిస్థిమితం లేని వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాపూర్ సొసైటీ గోదాం సమీపంలో అదే గ్రామానికి చెందిన నక్క గట్టయ్య అనే మతిస్థిమితం లేని వ్యక్తిని కారు ఢీకొట్టిందన్నారు. తీవ్ర గాయాలైన గట్టయ్యను స్థానికుల ఆస్పత్రికి తరలించారు.

నా పిల్లలన్నాడు.. మొహం చాటేశాడు

● జైలు జీవితం అనుభవించి సత్ప్రవర్తన కింద బయటకు ● పిల్లలను వదిలేసి వెళ్లిన తండ్రి

జమ్మికుంట/జమ్మికుంట రూరల్, జూలై 10: భార్య మృతి చెందిన కేసులో పద్నాలుగేళ్ల జైలు జీవితం అనుభవించిన ఓ తండ్రి ఆనాథాశ్రమంలో ఉన్న తన పిల్లల వద్దకు వచ్చాడు. ఇన్నాళ్లు పిల్లలకు దూరం అయ్యానని, నా అన్న వారు తెలియకుండా పెరిగారని, ఇకపై తన వద్ద పెట్టుకుంటానని, వారికి ఏ లోటు రాకుండా చూసుకుంటానని కల్లబొల్లి మాటలు చెప్పి వెంట తీసుకు వెళ్లాడు. రెండు రోజులు గడువక ముందే హైదరాబాద్ చెక్కేశాడు.

జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన సామ సారయ్య సత్తెమ్మ దంపతులకు కుమార్తె పూజ, కుమారుడు బన్ని ఉన్నారు. కుటుంబ కలహాలతో తీవ్ర కోపోద్రిక్తుడైన సారయ్య భార్య సత్తెమ్మను వెనక్కి నెట్టడంతో మృత్యువాత పడింది. ఈ సంఘటన 2010సంవత్సరంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనలో సారయ్యకు జీవిత ఖైదు పడింది. ఆ సమయంలో పూజ 5సంవత్సరాలు, బన్ని 4సంవత్సరాలు ఉన్నారు. పోలీసుల సహకారంతో జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గల స్పందన ఆనాథాశ్రమంలో పిల్లలను చేర్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 3న సత్ప్రవర్తన కింద సారయ్యను విడుదల చేయగా నేరుగా ఆనాథాశ్రమంకు చేరుకున్నాడు. ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లిలో ఇళ్లు అద్దెకు తీసుకున్నానని, పిల్లలను కూడా తన వెంట ఉంచుకుంటానని, ఇకపై వారికి ఏ లోటు రానివ్వనని కల్లబొల్లి మాటలు చెప్పి ఆశ్రమం నిర్వాహకుడిని నమ్మించాడు. ఈ నెల 4న పూజ, బన్నిలను తీసుకెళ్లాడు. మరుసటి రోజు హైదరాబాద్ వెళ్తానని, జైలు అకౌంటెంట్ ఫోన్ చేశాడని, మనకు డబ్బులు వచ్చేవి ఉన్నాయని, తీసుకువస్తానని చెప్పి తెల్లవారు జామున 5గం టలకు ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం 5గంటలకు ఫోన్ చేసి మీరు నా పిల్లలు కాదు, నాకు పుట్టలేదు, సర్టిఫికెట్లపై నా పేరు తీసివేయాలని, తాను మరో వివాహం చేసుకుంటున్నానని, నా పేరిట ఉన్న కొద్దో గొప్పో ఆస్తిని వారికే ఇచ్చేస్తానని చెప్పి అతనిలో ఉన్న కసాయి తనాన్ని నిరూపించుకున్నాడు. ఒక్కసారి షాక్ గురైన పూజ, బన్నిలు కన్నీంటి పర్యాంతమై తనను చేరదీసిన ఆశ్రమం బాటపట్టారు. వారిని చూసి చలించిన ఆశ్రమం నిర్వాహకుడు గోప రాజు వీరస్వామి దగ్గరకు తీసుకుని ఏం జరిగిందో అడిగి తెలుసుకున్నాడు. మీకు నేను ఉన్నా, మీరు అధైర్యపడద్దని ధైర్యం చెప్పి లోనికి తీసుకువెళ్లి భోజనం పెట్టాడు. వారి తండ్రి చేసిన పని తెలుసుకున్న తోటి పిల్లలు కోపంతో రగిలి పోయారు.



ఆశ్రమానికి వచ్చిన పూజ, బన్ని

రామడుగు ఎస్ఐతో ప్రాణహాని

●వెలిచాలకు చెందిన కుతాడి కనకయ్య ఆరోపణ

సుభాష్‌నగర్, జూలై 10: రామడుగు ఎస్ఐతో తనకు ప్రాణహాని ఉందని వెలిచాల గ్రామానికి చెందిన కుతాడి కనకయ్య, అతడి భార్య అనిత తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో కుతాడి కనకయ్య మాట్లాడుతూ దొంగతనం విషయంలో తప్పుడు ఫిర్యాదు చేయడంతో ఎలాంటి విచారణ చేయకుండా పోలీసులు తనను కొట్టి కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఏప్రిల్‌లో జరిగిన గొర్రెల దొంగతనం కేసులో తనను అన్యాయంగా ఇరికించారని, నేరాన్ని ఒప్పుకోవాలని చిత్రహింసలకు గురి చేసిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని కోరారు. జూన్ 11న ఇంట్లో నిద్రిస్తున్న తనను తెల్లవారుజామున 4గంటలకు రామడుగు పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి విపరీతంగా కొట్టారని ఆరోపించాడు. అదేరోజు కరీంనగర్‌కు తరలించి మళ్లీ కొట్టారని, లేవలేని స్థితిలో ఉన్న తనను జూన్ 12న రాత్రి 10 గంటలకు ఇంటికి పంపించారని తెలిపారు. 8 మంది కానిస్టేబుల్స్, ఒక ఎస్ఐ కలిసి తనను విపరీతంగా కొట్టారని ఆరోపించారు. ఎస్ఐపై తగు చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కుతాడి కనకయ్య కోరాడు. అనంతరం కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌లో విచారణ పేరుతో చిత్రహింసలకు గురి చేసిన ఎస్ఐని సస్పెండ్ చేయాలని కోరారు. సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కె.నాగరాణి, పుష్పలత, రాణి తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ : ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, జూలై 10: శంకరపట్నం మండలం మొలంగూర్ ఎక్స్ రోడ్ వద్ద బుధవారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. సైదాపూర్ మండలంలోని బూడిదపల్లి గ్రామానికి చెందిన పడాల వెంకటస్వామి తన భార్య రాజేశ్వరితో కలిసి మొలంగూర్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో మొలంగూర్ గ్రామానికి చెందిన తడిగొప్పుల సంపత్ ఎదురుగా వస్తున్నాడు. రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో పడాల వెంకటస్వామికి, సంపత్‌లకు స్వల్పగాయాలు కాగా 108వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, జూలై 10: కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తిలో కరీంనగర్ రూరల్ పోలీసులు రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని పోలీసు ఠాణాకు తరలించి కేసు నమోదు చేశారు. కాగా గ్రామంలో భారీగా ఇసుకను నిలువ చేసినట్లుగా మైనింగ్, పోలీసుల తనిఖీల్లో వెల్లడైంది.

చోరీ కేసులో 8 నెలల జైలు శిక్ష

చిగురుమామిడి, జూలై 10: మండలంలో కొండాపూర్ గ్రామంలో గత సంవత్సరం నవంబరు 8 తేదీన ఇదే గ్రామానికి చెందిన దరిపల్లి లచ్చవ్వ అనే వృద్ధురాలిని మోసం చేసి పర్వతం రాజు అనే వ్యక్తి బంగారు ఆభరణాలు దొంగిలించిన కేసులో 8 నెలల జైలు శిక్ష పడినట్లు ఎస్సై బండి రాజేశ్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్యాస్ స్టౌవ్ రిపేర్ చేస్తానని చెప్పి పర్వతం రాజు అనే వ్యక్తి ఆమె ఒంటిపై ఉన్న కమ్మలు, ఇతర బంగారు వస్తువులను దొంగలించి పారిపోయాడు. దీనిపై కేసు నమోదు అయింది. దీనిపై ఎక్సైజ్ శాఖ కోర్టు నేరస్తునికి ఎనమిది నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయాల జరిమానా విధించినట్లు తెలిపారు. ఇప్పటికైనా గ్రామాల్లోకి గుర్తు తెలియని వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

పీహెచ్‌సీ ఏర్పాటు ఎప్పుడో?

● మంజూరైనా స్థల సేకరణలో జాప్యం ● పొంచిఉన్న వ్యాధుల ముప్పు

గన్నేరువరం, జులై 10: గన్నేరువరం మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యం కోసం పక్క మండలమైన తిమ్మాపూర్, జిల్లా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. తిమ్మాపూర్‌కు 30 కిలోమీటర్లు, జిల్లా ఆసుపత్రికి 40 కిలోమీటర్ల దూరం వెళ్లవలిసి వస్తుంది. అత్యవసర సమయాల్లో దూరభారంతో చికిత్స అందక ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొంది. సాధారణ పరీక్షలకు వెళ్లే గర్భిణీలు పీఎచ్‌సీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో గన్నేరువరం, ఖాసింపేట, జంగపల్లి, గునుకుల కొండాపూర్ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు ఉండగా వీటిని పల్లె దవాఖానాలుగా మార్చారు. వీటిలో గన్నేరువరం, జంగపల్లి సబ్‌సెంటర్ లకు ఎంఎల్‌ఎచ్‌పీలుగా ఉపేందర్, సాహితి డాక్టర్లను నియమించారు. మిగతా రెండు సబ్ సెంటర్‌లలో డాక్టర్లు లేక ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో ఇద్దరు హెల్త్ అసిస్టెంట్‌లు ఉండగా ప్రస్తుతం వారు ఇరువురు వేరే మండలానికి బదిలీ కాగా మండలానికి హెల్త్ అసిస్టెంట్ లేకపోవడంతో ఏఎన్ఎంలపై భారం పడింది. ప్రస్తుతం తిమ్మాపూర్ పీఎచ్‌సీ డాక్టర్ ప్రణవ్ మండలానికి ఇంచార్జిగా ఉన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై, పరిసరాల పరిశుభ్రతపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించడానికి సైతం సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



పీహెచ్‌సీ కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి(ఫైల్)

స్థల సేకరణపై స్పష్టత కరువు

మండలానికి పీఎచ్‌సీ మంజూరుకావడంతో గత సంవత్సరం నవంబర్‌లో పీఎచ్‌సీ నిర్మాణం కోసం ఖాసింపేట చౌరస్తా వద్ద స్థలాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మండల అధికారులతో కలిసి పరిశీలించారు. అట్టి స్థలంలో పీహెచ్‌సీ నిర్మిస్తే మండలంలోని వివిధ గ్రామాలకు అనుకూలంగా ఉంటుందని ప్రజాప్రతినిధులు, ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. నేటి వరకు పీహెచ్‌సీ నిర్మాణంపై ఎలాంటి స్పష్టత రాలేదు.

స్కైలాబ్ @ 45ఏళ్లు

చొప్పదండి,జూలై10: స్కైలాబ్‌కు నేటితో 45ఏళ్లు నిండాయి. 1979 జూన్, జూలై నెలలో పైనుంచి ఏదో పడుతుందని ఇక బతుకలేమంటూ అంతటా ప్రచారం జరిగింది. ఇక చనిపోతామంటూ ప్రజలు కన్నీళ్లు పెట్టుకున్నారు. స్కైలాబ్ అనే ఉపగ్రహం ఆకాశంలో గతి తప్పిందని భూమిపై కూలి పోతుందని శాస్త్రవేత్తలు ప్రకటించగా ప్రజల్లో భయాందోళనలు పెరిగిపోయాయి. ఇక బతుకలేమంటూ కొంతమంది విలువైన సంపదను విక్రయించుకొని విందులు చేసుకున్నారు. కరీంనగర్ జిల్లాలోనే స్కైలాబ్ పడుతుందని వదంతులు వ్యాపించాయి. 1979 జూలై 11న స్కైలాబ్ ఉపగ్రహాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో సముద్రంలో దింపామని రేడియోలో వార్తలు రావడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. విందులు చేసుకున్నారు. ప్రజలందరూ స్కైలాబ్ పడ్డరోజున గడగడలాడిపోయారు. అయితే ఆ రోజు కొందరికి తీపిగుర్తుగా మిగిలిపోయింది.అప్పుడు పుట్టిన వారికి గ్రామాలలో స్కైలాబ్‌గా పేరు పెట్టుకున్నారు.

పేరులోనే ప్రత్యేకత

కందుల స్కైలాబ్ గౌడ్, మంగళపల్లి



స్కైలాబ్ పడ్డరోజు పుట్టడంతో తల్లిదండ్రులు స్కైలాబ్ గౌడ్‌గా నామకరణం చేశారు. అందరి కన్నా తన పేరులో ప్రత్యేకత కలిగి ఉండడం సంతోషంగా ఉంది. నేను పుట్టిన రోజున దేశమంతా గడగడలాడిపోయి అంతా ఊపిరిపీల్చుకోవడం గర్వకారణంగా ఉంది,

గోదాముల వద్దే పడిగాపులు

- సీఎంఆర్ అన్‌లోడింగ్‌లో తీవ్ర జాప్యం
- రైస్ మిల్లుల్లో పేరుకుపోతున్న బియ్యం నిల్వలు



సుల్తానాబాద్‌లోని గోదాములు



రైల్వే ట్రాక్ వెంట నిలిచి ఉన్న బియ్యం లారీలు

సుల్తానాబాద్, జూలై 10: సుల్తానాబాద్ ప్రాంతంలోని రైస్ మిల్లుల నుంచి బియ్యం లోడ్‌లతో గోదాములకు వెళుతున్న లారీలు దిగుమతి కాక రోజుల తరబడి అక్కడే వద్దనే ఉంటున్నాయి. దీంతో లారీల వారు, మిల్లర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఓవైపు బియ్యం పంపించాలని ప్రభుత్వ యంత్రాంగం మిల్లర్లపై ఒత్తిడి పెంచుతుంటే.. అదే సమయంలో మిల్లుల నుంచి ఎఫ్‌సీఐకి పంపించే బియ్యంను దిగుమతి చేసుకోవడంలో గోదామల నిర్వాహకులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. మిల్లుల నుంచి బియ్యం లోడ్లతో వెళ్లిన లారీలు రెండు మూడు రోజుల నుంచి గోదాముల వద్దే ఉండిపోతున్నాయి. సుల్తానాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్‌ను ఆనుకుని ఉన్న గోదాముల వద్ద ఈ సమస్య ఎక్కువగా ఉంది. దిగుమతులు ఆలస్యం కావడం వలన లారీ డ్రైవర్లు, క్లీనర్లు అక్కడే ఉండాల్సి వస్తోంది. మరో వైపు రైస్‌మిల్లర్లకు లారీల కిరాయ భారం పడుతోంది. ప్రతీ లారీ బియ్యం లోడ్ వెంట ఇచ్చే 24 గంటల గడువు మాత్రమే ఉండే ఆన్‌లైన్ వేబిల్లులను ప్రతీరోజు క్యాన్సిల్ చేసి వాటిని ఎప్పటికపుడు అప్‌డేట్ చేస్తూ పొడిగించాల్సి వస్తోంది.

● మిల్లులు ఎక్కువ.. గోదాములు తక్కువ..

సుల్తానాబాద్ ప్రాంతంలోనే దాదాపు వందకు పైగా రైస్ మిల్లులు ఉన్నాయి. ఈ మిల్లులకు అందుబాటులో మొదట ఒకేఒక్క గోదామును ఎఫ్‌సీఐ వారు రైల్వేస్టేషన్ సమీపంలో కేటాయించారు. అందులో స్థల సమస్య ఏర్పడి మిల్లుల నుంచి వచ్చిన బియ్యం లారీలు రోజుల తరబడి అక్కడే ఉండాల్సిన వచ్చింది. దాంతో మిల్లర్లు సతమతమవుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తమ ప్రాంతం మిల్లర్ల విజ్ఞప్తి మేరకు సుల్తానాబాద్ గోదాములను సందర్శించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో అదేరోజు సుగ్లాంపల్లిలోని మరో గోదాములో కూడా బియ్యం దిగుమతులకు స్థలాన్ని అందుబాటులోకి తెచ్చారు.

● రోజుకు 50 నుంచి 150 లారీలు..

సుల్తానాబాద్ పట్టణంలోని రైల్వేస్టేషన్ పక్కన ఉన్న గోదాములకు, సుగ్లాంపల్లి గోదాములకు జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి కూడా రోజుకు 50 నుంచి 150లారీల వరకు బియ్యం లోడులు వస్తున్నాయి. ఇక్కడ స్థల సమస్య ఏర్పడి రోజుల తరబడి అక్కడే ఉండాల్సి వస్తోంది. సుల్తానాబాద్ చుట్టూ చాలా గోదాములు ఉన్నాయని, వాటిని కూడా అందుబాటులో ఉంచాలని మిల్లర్లు ఎఫ్‌సీఐ అధికారులను కోరుతున్నారు.

● మిల్లుల్లో బియ్యం నిల్వలు పేరుకుపోయాయి..

- విజయపాల్‌రెడ్డి, రైస్ మిల్లర్ల సంఘం ప్రధాన కార్యదర్శి

గోదాముల్లో సరిపడా స్థలాలను మిల్లర్లకు ఎఫ్‌సీఐ అందుబాటులో ఉంచకపోవడం వలన మిల్లుల్లో బియ్యం నిలువలు పేరుకుపోయాయి. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని స్థల సమస్య పరిష్కరించాలి. రోజుల తరబడి లారీలను నిలపకుండా వెంటనే చర్యలు చేపట్టాలి.

కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి



పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

పెద్దపల్లి రూరల్, జూలై 10 : కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి జి.జ్యోతి అన్నారు. బుధవారం బొగ్గు బ్లాకుల వేలాన్ని రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం 26వేలు నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా జ్యోతి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం గతంకంటే వేగంగా కార్మిక వ్యతిరేక సంస్కరణలో ప్రైవేటీకరణ విధానాలను వేగవంతంగా అమలుచేస్తోందని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను అమలు చేస్తోందన్నారు. బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాటం ఉధృతం చేయడానికి దేశవ్యాప్తంగా డిమాండ్స్ డే పాటించాలని సీఐటీయూ పిలుపునిచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో కార్మికవర్గం ఆశతో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిందని, కానీ ప్రభుత్వం భిన్నంగా కార్మికుల సమస్యలపై చర్చ లేకుండా చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే గ్రామపంచాయతీ, మున్సిపల్, అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ వెంకటస్వామి, సాగర్, బి వనజారాణి, బందరి అశోక్, శ్రీనివాస్, సాగర్ సతీష్, శాంత, కార్మికులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఆరిఫొద్దీన్‌కు సీఐటీయూ నాయకులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి కృష్ణకుమారి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన క్రమంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో విఫలమైందన్నారు. కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఓపీఎస్ రద్దు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు షరీఫ్ ఉన్నిస, భాగ్య, విశాలాక్షి, లలిత తదితరులు ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : డిమాండ్స్ డే సందర్భంగా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ జాహేద్ పాషాకు బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంద రాజేందర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంద రాజేందర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చేయాలన్నారు. బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని రద్దు చేసి అవుట్ సోర్స్ కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనం ఇస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని 24 డిమాండ్లతో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాగమల్ల సురేష్, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవు

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, జూలై 10 : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలు దరిచేరకుండా ఉంటాయని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. బుధవారం మండలంలోని గౌరెడ్డిపేట గ్రామంలో జ్వరాలు ప్రబలుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్థులు తీసుకురావడంతో బుధవారం వైద్య, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. ప్రజలకు విషజ్వరాలు రావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.వైద్యులతో మాట్లాడి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో, వార్డుల్లో పర్యటించి జ్వరపీడితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని, ప్రజలు వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో వర్షంనీరు నిల్వకుండా జాగ్రత్త తీసుకోవాలని, పంచాయతీ అధికారులు పారిశుధ్యం, తాగునీటి క్లోరినేషన్‌పై అధికారులు దృష్టి సారించాలన్నారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, ఎంపీడీవో, ఎంపీవో సుదర్శన్, నూగిళ్ల మల్లయ్య, సందనవేని రాజేందర్, మాజీ జడ్పీటీసీ రామ్మూర్తి, భూతగడ్డ సంపత్, మాజీ సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్, నాయకులు అభిలాష్, జగదీష్, కరుణాకర్, మల్లేష్, సాగర్, శరత్, కనుకయ్య పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, అధికారులు

ధైర్యంతో ముందుకు సాగితేనే కష్టాలను జయిస్తాం..

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



సుజాతను సన్మానిస్తున్న కొప్పుల ఈశ్వర్, కోరుకంటి చందర్

కళ్యాణ్‌నగర్, జూలై 10: ధైర్యంతో ముందుకు సాగినప్పుడే జీవితంలో ఎదురైన కష్టాలను జయించగలుగుతామని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం జ్యోతిగాంధీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిలక్‌నగర్ డౌన్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై 25 సంవత్సరాల క్రితం గోదావరిఖనిలో యాసిడ్ దాడికి గురై మొక్కవోని ధైర్యంతో జీవితంలో స్థిరపడిన సుజాతకు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసిడ్ దాడికి గురైన సుజాత దుర్మార్గులను ఎదురించి జీవితంలో విజేతగా నిలిచి సుజాత మహిళలందరికి ఆదర్శంగా నిలిచిందన్నారు. 1996లో జరిగిన ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిందన్నారు. బీజేపీ ఎస్‌సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ మాట్లాడుతూ సుజాత మొక్కవోని ధైర్యంతో నిలబడి దుండగులు చేసిన యాసిడ్ దాడి నుంచి తప్పించుకుని జీవితంలో స్థిరపడిందన్నారు. కార్యక్రమంలో దయానంద్ గాంధీ, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నాయకులు కౌశిక హరినాథ్, కందుల సంధ్యారాణి, వైద్యులు లక్ష్మీవాణి, పెద్దెల్లి ప్రకాష్, గాలి సునిత, దామెర శంకర్, కంది రవీందర్‌రెడ్డి, పీఎస్ అమరేందర్, సంధ్యారెడ్డి, విజయ, సంతోష, చంద్రకళ, మానస, మ్యాజిక్ రాజా, అరవింద్, నారాయణ పాల్గొన్నారు.

ఖని ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్

కళ్యాణ్‌నగర్, జూలై 10: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్ చేశారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో సుమారు రూ.4లక్షలు ఖర్చు అయ్యే వైద్యాన్ని ఉచితంగా ఆపరేషన్‌ను నిర్వహించారు. గోదావరిఖనికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి ఈనెల 6న మోటార్‌సైకిల్ అదుపుతప్పి కింద పడగా అతని ముఖంలో ఆరు ఎముకలు విరిగిపోయాయి. దవడలు విరిగడంతో బుధవారం ప్రొఫెసర్‌లు శ్రావణ్ తేజ, సుమలత ఆధ్వర్యంలో సుమారు 4గంటల పాటు ఆపరేషన్ నిర్వహించి అతనికి ఆరుప్లేట్లు, 20స్క్రూలు బిగించి ఎముకలను సరిచేశారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇది మొదటి ఆపరేషన్. దవడల్లోని పళ్లు, ఎముకలు విరిగిపోవడంతో శ్రీనివాస్‌కు రూట్ కెనాల్ ద్వారా దంతాలను ప్లేట్ల ద్వారా ఫేస్ మేకింగ్ చేసి యథాస్థానంతో ముఖ భాగాలను సరిచేశారు. అరుదైన ఆపరేషన్ చేసిన వైద్యులను కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ అభినందించారు. ఆపరేషన్‌ను విజయవంతం చేసిన శ్రావణ్‌తేజ, సుమలత, అనిస్తీషియా డాక్టర్లు భాను, మౌనిక, కరుణాకర్‌లను అభినందించారు.

ఉచిత వైద్య పరీక్షలు

ధర్మారం, జూలై 10: మండల కేంద్రంలో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వంద మందికి ఉచిత దయాబెటిక్ పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్‌శెట్టి, రీజియన్ చైర్‌పర్సన్ తన్నీరు రాజేందర్, ఉపాధ్యక్షులు ఇప్ప మల్లేశం, బొట్ల లక్ష్మీనారాయణ, నాడెం శ్రీనివాస్, కోశాధికారి కట్ట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గానకోకిల పురస్కారానికి ఎంపిక

ఎలిగేడు, జూలై 10 : మండల కేంద్రానికి చెందిన గాయకుడు వంగ రమేష్ ఉద్యమ నాయకుల పురస్కారంలో భాగంగా ఈనెల 12న కరీంనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఉద్యమ గానకోకిల పురస్కారాన్ని అందజేస్తున్నట్లు ఉత్తరతెలంగాణ పీపుల్స్ మూమెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్, కార్యదర్శి ముక్కెర సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లిటౌన్, జూలై 10 : గ్రూప్ 1 పోటీ పరీక్ష శిక్షణ కోసం జూలై 19లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మొహమ్మద్ మేరాజ్ మహమ్మద్ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమ శాఖ గ్రూప్-1 మెయిన్స్ పోటీ పరీక్షల ఉచిత శిక్షణ తరగతులకు నోటిఫికేషన్ జారీచేసిందని, అర్హులైనవారు ఈనెల 19లోగా దరఖాస్తులను తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ మూడవ ఫ్లోర్, జామియా నిజామియా కాంప్లెక్స్ గన్‌ఫౌండ్రి, హైదరాబాద్‌లో సమర్పించాలన్నారు. 22 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని, మరిన్ని వివరాల కోసం 040-23236112 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వ్యాపార సంస్థలకు జరిమానా

కోల్‌సిటీ, జూలై 10: డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండా రామగుండం కార్పొరేషన్ పరిధిలో వ్యాపారాలు నిర్వహిస్తున్న సంస్థలకు నగరపాలక సంస్థ జరిమానా విధిస్తోంది. బుధవారం రెండు వాహనాల షోరూమ్‌లకు జరిమానా విధించారు. ఇందులో ఆదర్శ టీవీఎస్ షోరూమ్‌కు రూ.5వేలు, ట్రెండ్స్‌రాయల్ టీవీ, బైక్ షోరూమ్‌కు రూ.2వేల జరిమానా విధించారు. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

రైతులకు అవగాహన

జూలపల్లి, జూలై 10 : మండలంలోని చీమలపేటలో డ్రమ్‌సీడ్ విధానంపై ఏఈవో కిరన్మయి రైతులకు అవగాహన కల్పించారు. ఈవిధానం ద్వారా దిగుబడి పెరుగుతుందని, దీంతో ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చన్నారు.

'సమస్యలకు నిలయమైన ప్రభుత్వ ఆసుపత్రి'

పెద్దపల్లిటౌన్, జూలై 10: పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రి సమస్యలకు నిలయంగా మారిందని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్)నాయకుడు భూషణవేణి కృష్ణ ఆరోపించారు. ఆస్పత్రిలో నిరసన వ్యక్తం చేసిన అనంతరం కృష్ణ మాట్లాడారు. ఆసుపత్రిలో బాలుడు సెప్టిక్‌ట్యాంక్‌లో పడటం విషాదకరమని, అధికారుల నిర్లక్ష్యంతో బాలుడు మృతిచెందాడని దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

ప్రజల పక్షాన పోరాడుతాం..


మంథని, జూలై 10: ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీపరంగా నిత్యం ప్రజల కోసం ప్రభుత్వంపై పోరాటం చేస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం జరిగిన మంథని నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి దీటుగా పార్లమెంట్‌లో ఎన్నికల్లో అధికంగా ఓట్లు రావటానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు.

గీట్ల జనార్దన్‌రెడ్డికి నివాళి

గోదావరిఖని, జూలై 10:మాజీ ఎమ్మెల్సీ గీట్ల జనార్దన్‌రెడ్డి జయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని ఆయన విగ్రహానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. లైశెట్టి రాజయ్య, అచ్చ వేణు, నూతి తిరుపతి, సింహచలం రత్నకర్, ఆడప శ్రీనివాస్, తోకల రమేష్, నూనె శరత్ కుమార్, మెతుకు దేవరాజ్, యాసర్ల తిమోతి, కిరణ్ జీ, సత్యనారాయణ, అల్లం ఐలయ్య, కనకయ్య, గఫార్, వెంకటేష్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జనక్ ప్రసాద్

గోదావరిఖని, జూలై 10: రాష్ట్ర మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్‌గా సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని అంజయ్య భవన్‌లో లేబర్‌అండ్‌ఎంప్లాయిస్‌మెంట్ డైరెక్టర్ కృష్ణా ఆదిత్య, జాయిలేబర్ కమిషనర్ శేఖరన్ సమక్షంలో జనక్ ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, పీసీసీ ప్రచార కమిటీ అధ్యక్షులు మధుయాష్కీగౌడ్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు.



ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా



పర్సనల్ అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రామగిరి, జూలై 10: సింగరేణి బొగ్గు బ్లాక్‌ల వేలం రద్దు చేయాలనే ప్రధాన డిమాండ్‌పై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం వేలం రద్దును కోరుతూ పర్సనల్ అధికారి రవీందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంఆర్‌సీ రెడ్డి, జూపాక రాంచందర్, డీటీ రావు, గంగాధర్, నరేష్, సంపత్, కనకయ్య, కొమురయ్య, కుమార్, పాషా తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో క్రమశిక్షణ అవసరం : ఏపీఏ జీఎం

రామగిరి, జూలై 10: చెడు అలవాట్లకు దూరంగా ఉంటు విధుల్లో క్రమశిక్షణతో పనులు చేయాలని ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక ఎంవీటీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కారుణ్య నియామకాలు పొందిన 88 మంది అభ్యర్థులకు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సింగరేణి ఉద్యోగం రావడం అదృష్టంగా భావించాలని సూచించారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని క్రమంతప్పకుండా విధులకు హాజరుకావాలని, విధి నిర్వహణలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కోరారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అధికారులు సత్యనారాయణ, మల్లన్న, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం వెంకటేశ్వర్లు

మూడో రోజు ఏఐటీయూసీ రిలే నిరాహార దీక్ష

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 10: బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ చేపట్టిన రిలే నిరాహార దీక్ష మూడవ రోజైన బుధవారం కొనసాగింది. ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట యూనియన్ శ్రేణులు నిరాహార దీక్ష చేశారు. గతంలో వలె నామినేషన్ పద్ధతిలో బొగ్గు గనులను కేటాయించాలని, రాష్ట్రంలోని గనులను సింగరేణికి మాత్రమే అప్పగించాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రైవేట్ కంపెనీలకు అప్పగిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ నిరసనలో ఎల్ ప్రకాష్, రాజారత్నం, అన్నారావు, జీ రవీందర్, శ్యాంసన్, ఎజ్జ రాజయ్య, మహేందర్, ఆజంనేయులు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట సీఐటీయూ ధర్నా

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 10: బొగ్గు బావుల ప్రైవేటీకరణ, కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం ఆర్జీ-2 జీఎంఆఫీస్ ఎదుట సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ధర్నా చేశారు. పదేళ్ళ అధికారంలో ఉన్న బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని,లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నట్టు నాయకులు పేర్కొన్నారు. బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాని డిమాండ్ చేశారు. గనులు దక్కించుకునేలా పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈధర్నాలో ఉల్లి మొగిలి, కుంట ప్రవీణ్, సంపత్, రాంప్రసాద్, శ్రావణ్, వినేష్, నాగరాజు, రాజయ్య, రాకేష్, జగదీష్, అవినాష్, శ్రీధర్ పాల్గొన్నారు.

నియామక ఉత్తర్వులు ఇప్పించాలి

సుల్తానాబాద్, జూలై 10: రాష్ట్రంలో 61 ఏళ్ల పైబడిన వీఆర్‌ఏల వారసులకు త్వరగా నియామక ఉత్తర్వులు ఇప్పించాలని కోరుతూ పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుకు వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏల వారసులంతా కలసి బుధవారం సుల్తానాబాద్‌లో ఎమ్మెల్యేకు తమ గోడు విన్నవించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తూ కారుణ్య నియామకాల కోసం జీవో 81,85 ప్రకారం 3797 మంది 61 ఏళ్ల వయస్సు పైబడిన వారి వారసులకు ఉద్యోగ నియామకాల కోసం ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయితే కోర్టులో స్టే ఉన్న కారణంగా ఇంత కాలం వారసులకు నియామక ఉత్తర్వులు జారీ చేయలేకపోయారన్నారు. కానీ ఇపుడు కోర్టులో స్టే ఎత్తివేయడంతో తమకు న్యాయం చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. సోమవారం ప్రజావాణిలో కూడా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు.

'ఉద్యోగులకు బదిలీలు సహజం'



బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను సన్మానించిన మాజీ ఎంపీటీసీ

ఎలిగేడు, జూలై 10: ఉద్యోగులకు విధి నిర్వహణలో బదిలీలు సహజమని రిటైర్డ్ ఉపాధ్యాయులు మాజీ ఎంపీటీసీ కోటిరెడ్డి ప్రేమలతకమలాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామం ఎంపియుపిఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న గడ్డం శ్రీనివాస్, పెరుక భీమయ్య, బాలకిషన్‌లను సన్మానించారు. ఇక్కడికీ బదిలీపై వచ్చిన వేణుకుమార్, రవీందర్‌రావు, సుధాకర్, వసంత, మాధవిలను స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపు విజేంద్రరెడ్డి, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ నరేష్, అంగన్వాడీ టీచర్ ఓదేశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందించిన ఆపరేటర్లు

సుల్తానాబాద్, జూలై 10: డిమాండ్స్‌డేను పురస్కరించుకుని సుల్తానాబాద్ రైస్ మిల్లు ఆపరేటర్ల సంఘంతో పాటు పలు సంఘాల ప్రతినిధులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ వారి ఆధ్వర్యంలో ఆపరేటర్లు తహసీల్దార్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో రైస్‌మిల్లు ఆపరేటర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నౌండ్ల బ్రహ్మచారి, ఉపాధ్యక్షులు వీరగోని కిరణ్ గౌడ్, రాజమౌళి, గుమాస్తాల సంఘం అధ్యక్షులు మాతంగి రాయమ్ము, లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు పోగుల తిరుపతి, జంగా తిరుపతి రెడ్డి, మీర్జా మంజూరు బేగ్, మీర్జా మునీర్ బేగ్, సయ్యద్ ముజహార్ పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడంలో లయన్స్‌క్లబ్ ముందుంటుంది



వికలాంగులకు కృత్రిమ అవయవాలు అమర్చుతున్న వెంకటేశ్వర్‌రావు

కళ్యాణ్‌నగర్, జూలై 10: పేదలకు వైద్య సేవలు అందించడంలో లయన్స్‌క్లబ్ ముందుంటుందని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిరుపేద వికలాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాల్లో కూడా సేవలు అందిస్తుందని, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్లతో పాటు నిత్యాన్నదానం, కృత్రిమ అవయవాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రామగుండం లయన్స్‌క్లబ్ సేవా భావంలో జిల్లాకే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప, కోశాధికారి గోవర్ధన్‌రెడ్డి, సభ్యులు మేడిశెట్టి గంగాధర్, బంక రామస్వామి, తిలక్‌చక్రవర్తి, శరత్‌బాబు, కంజపురం జయప్రద, బంక కళావతి, మనీష్ అగర్వాల్, ఉమారాణి, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆంజేయులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ హామీల అమలుకు పోరాటం'

కమాన్‌పూర్, జూలై 10: కాంగ్రెస్ ప్రభుత్వం మాటలతో కాలయాపన చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన బెడుతోందని, ప్రజలు పక్షాన ప్రజా పోరాటలు చేద్దామని నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి పుట్ట మధు అన్నారు. మండలంలోని దేవునిపల్లెలో నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలుపరచటంలో కొర్రీలు పెడుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. ఈసందర్భంగా పుట్ట మధును నాయకులు, కార్యకర్తలు సత్కరించారు.

ఘనంగా అమ్మవారి బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కళ్యాణ్‌నగర్, జూలై 10: ఆషాడమాసం సందర్భంగా గోదావరిఖనిలో బుధవారం 50వ డివిజన్ కార్పొరేటర్ గణముక్కుల మహాలక్ష్మితిరుపతి ఆధ్వర్యంలో అమ్మవారి బోనాలను ఘనంగా నిర్వహించారు. పోతరాజుల నృత్యాలతో బోనాలను మహిళలు నెత్తిన పెట్టుకుని స్వతంత్ర చౌక్ నుంచి లక్ష్మీనగర్‌గుండా పోచమ్మగుడి వరకు ర్యాలీగా వచ్చారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ రామగుండం ప్రజలను అమ్మవారు చల్లగా చూడాలని, ఆషాడంలో మహిళలు బోనాలను ఎత్తుకుని ఊరేగింపు చేయడం రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఆనవాయితీ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంతల రాజేష్, బాల రాజ్‌కుమార్, నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

ముత్తారం, జూలై 10: మండలంలోని ఖమ్మంపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న నెరేడుగోమ్మ సాగర్‌రావుకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఈనెల 4న షోకాజ్ నోటీసు పంపించారు. తాజా మాజీ సర్పంచ్ సముద్రాల రమేష్ ముత్తారం ఎంపీఓ వేణుమాధవ్, ఖమ్మంపల్లి పంచాయితీ కార్యదర్శి సాగర్‌రావులపై ఫిర్యాదు మేరకు షోకాజు నోటిసులను అందజేశారు. తాను అందుబాటులో లేనప్పుడు సర్పంచ్ లేకుండా ఉపసర్పంచ్‌తో గ్రామసభను ఏర్పాటు చేశారని అలాగే సద్దుల బతుకమ్మ పండుగకు బల్బులు హోల్డర్లు కొనుగోలు చేసి గ్రామ పంచా యతీలో భద్రపరిస్తే వాటిని అపహరించారని వారిపై ఇప్పటి వరకు కూడా చర్యలు తీసుకోలేదన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయకుండా అపహరించిన వారికి సహకరిస్తున్నాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ కోయా శ్రీహర్ష షోకాజు నోటీసు పంపించారు. ఈ మేరకు నోటీసులు అందిన ఏడు రోజులలో సంజాయిషీ అందిచాలని వారు అదేశించారు.